సాక్షి నల్లగొండ

శుక్రవారం ၊ 20 ၊ జూన్ ၊ 2025



అధ్వానంగా కాల్వలు
జిల్లాలోని మధ్య తరహా ప్రాజెక్టుల్లో ఒకటైన శాలిగౌరారం ప్రాజెక్టు కాల్వలు అధ్వానంగా మారాయి. - IIలో



జల సంప్రోక్షణ, హారతి
యాదగిరిగుట్ట ప్రధానాలయంలో ప్రతి భక్తుడికి అభిషేక జల సంప్రోక్షణ, హారతి ఇవ్వాలని ఈఓ ఆదేశించారు. - IIలో



నియామకాలు చేపట్టాలి
ప్రధాన ఆలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో రెగ్యులర్ పద్ధతిన నియామకాలు చేపట్టాలని మారం జగదీష్ కోరారు. - IIలో

న్యూస్‌రీల్

సీఎం పర్యటన వాయిదా

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : నాగార్జునసాగర్ నియోజకవర్గం పరిధిలోని తిరుమలగిరి(సాగర్) మండలంలో ఈనెల 21 జరగనున్న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన తాత్కాలికంగా వాయిదా పడినట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. సీఎం పర్యటన ఎప్పుడు ఉంటుందో.. తేదీ, వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని ఆ పార్టీ నేతలు తెలిపారు.

4.75 లక్షల మందికి రైతు భరోసా

నల్లగొండ : జిల్లాలో గురువారం నాటికి 4.75 లక్షల మంది రైతులకు రైతు భరోసా కింద రూ.516 కోట్లు జమ చేసినట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు భరోసా కింద అందిన సొమ్మును రైతులు వ్యవసాయ పనులకు వినియోగించుకోవాలని కోరారు. కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు ఈ నెల 20వ తేదీలోగా రైతు భరోసా కోసం బ్యాంకు పాస్‌బుక్, పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్ కాపీలను వ్యవసాయ విస్తరణ అధికారులకు అందజేయాలని సూచించారు. కొత్తగా వచ్చిన దరఖాస్తులను శుక్రవారం రాత్రి 8 గంటలలోగా ఆన్‌లైన్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

బీసీ గురుకులం డిగ్రీలో స్పాట్ అడ్మిషన్లు

నాగార్జునసాగర్ : నాగార్జునసాగర్‌లోని మహాత్మా జ్యోతీరావు పూలే తెలంగాణ రాష్ట్ర బీసీ గురుకుల డిగ్రీ కళాశాల (పురుషులు)లో స్పాట్ అడ్మిషన్లకు అవకాశం కల్పించినట్లు ప్రిన్సిపాల్ సీహెచ్.మాధవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ల ప్రక్రియ ఈ నెల 20 నుంచి 25వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఇంటర్లో 50శాతం మార్కులు సాధించి మార్చి–2025లో ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. ఆసక్తి గలిగిన విద్యార్థులు ఎస్ఎస్‌సీ, ఇంటర్ మెమో, టీసీ, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, స్టడీ సర్టిఫికెట్‌తో పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

నేడు బెస్ట్ అవైలబుల్ స్కీం డ్రా

నల్లగొండ : గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బెస్ట్ అవైలబుల్ స్కీం ద్వారా విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాల్లో ప్రవేశానికి శుక్రవారం పానగల్‌రోడ్డులోని గిరిజన సంక్షేమ హాస్టల్లో డ్రా నిర్వహించనున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి చత్రునాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, తల్లిదండ్రులు, గిరిజన సంఘా నాయకులు పాల్గొనాలని కోరారు.

ఉపకరణాలకు దరఖాస్తు గడువు పొడిగింపు

నల్లగొండ : దివ్యాంగులు ఉపకరణాల దరఖాస్తు గడువును ఈనెల 27వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల అభివృద్ధి శాఖ అధికారి కృష్ణవేణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన దివ్యాంగులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అభివృద్ధి, సంక్షేమమే బీజేపీ లక్ష్యం

రామగిరి(నల్లగొండ) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముందుకు సాగుతోందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడి 11 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గురువారం నల్లగొండలోని 38వ వార్డులో నిర్వహించిన వికసిత్ సంకల్ప సభలో మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ సుపరిపాలనలో భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, పల్లెబోయిన శ్యామసుందర్, మిర్యాల వెంకటేశం, పోతెపాక లింగస్వామి, కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, పాశం శ్రీనివాస్‌రెడ్డి, పకీర్ మోహన్‌రెడ్డి, పిన్నింటి నరేందర్‌రెడ్డి, మంగినేపల్లి కిషన్, కటకం శ్రీధర్, ఆగు రాజు, గుండ్లపల్లి శాంతిస్వరూప్, లోకేష్, మణెమ్మ, తార, శివానంద్, వెంకన్న, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

యూపీఎస్సీ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ : యూపీఎస్సీ ఉచిత శిక్షణకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీకి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నల్లగొండ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ డీడీ శశికల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ ఉత్తీర్ణులై వార్షిక ఆదాయం రూ.3 లక్షలు మించని వారు tsstudycircle.com.in వెబ్‌సైట్ ద్వారా మాత్రమే జూలై 7వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవలని సూచించారు. జూలై 13న ఎంపిక పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్ లేదా.. 040-23546552, 9396621492 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.



'మిషన్ పరివర్తన్'తో.. యువతలో మార్పు

మత్తుకు దూరం చేసి.. కొలువులకు దగ్గర చేశాం

- 'యువతేజం'తో వందల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాం
- గంజాయి రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా పని చేస్తున్నాం
- రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రత్యేక కార్యాచరణ
- 'సాక్షి'తో ఎస్పీ శరత్‌చంద్ర పవార్
- ఎస్పీగా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: 'జిల్లాలో గంజాయి నిర్మూలనే లక్ష్యంగా పనిచేస్తున్నాం. గంజాయి మత్తులో జోగుతున్న యువతలో 'మిషన్ పరివర్తన్' కార్యక్రమం ద్వారా కౌన్సెలింగ్ ఇచ్చి వారిలో మార్పు తీసుకొచ్చాం.'యువతేజం'తో ఉద్యోగాలు ఇప్పించి వారంతా సన్మార్గం నడిచేలా చేశాం. అని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీగా ఆయన బాధ్యతలు స్వీకరించి గురువారంతో ఏడాది పూర్తయింది. ఈ ఏడాది కాలంలో చేపట్టిన ప్రత్యేక కార్యాచరణను ఆయన 'సాక్షి' ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఈ సందర్భంగా వివరించిన అంశాలు ఆయన మాటల్లోనే..

యువతను దారిలో పెడుతున్నాం

జిల్లా మీదుగా గంజాయి రవాణా జరుగుతోంది. జిల్లాకు వచ్చిన మొదట్లోనే ఈ విషయాన్ని గుర్తించా. అప్పుడే గంజాయి అక్రమ రవాణా, విక్రయం, వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టా. జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి గట్టి నిఘా పెట్టాం. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టుల తరహాలో గంజాయి టెస్ట్ కిట్లను అందించి గంజాయికి బానిస అవుతున్న యువతను గుర్తించి దారిన పెట్టాలని నిర్ణయించుకున్నాం. దాదాపు 400 మందికి వారి తల్లిదండ్రుల సమక్షంలో సైకియాట్రిస్టులతో కౌన్సెలింగ్ ఇప్పించాం. గంజాయి సేవించడం వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్యంపై పడే ప్రభావం వివరించి మార్పు తెచ్చాం.

ప్రత్యేకంగా కేసులు ఫాలోఅప్

కేసులు నమోదు చేయడం , వదిలేయడం కాకుండా కేసులను ఫాలోఅప్ చేయడంపై ప్రత్యేకంగా దృష్టి సారించేలా కృషి చేస్తున్నా. ఇదే విషయాన్ని మా సిబ్బందికి చెబు తున్నా. తద్వారా ఛార్జిషీట్లు పక్కాగా నమోదు చేయడంతో కోర్టుల్లో శిక్షలు పడేలా చూస్తున్నాం. గతేడాది ఆరు నెలల్లో 6 కేసుల్లో, ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 9 కేసుల్లో జీవిత కారాగార శిక్ష పడింది.

రోడ్డు ప్రమాదాలను తగ్గించాం

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు 'ట్రిపుల్ ఆర్' అనే ప్రత్యేక కార్యక్రమం చేపట్టాం. పోలీసు శాఖలోని ప్రతి సీనియర్ అధికారి ఒక రాష్ట్ర రహదారిని దత్తత తీసుకొని వాటిపై రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక కార్యాచరణను అమలు చేశాం. దాంతో రాష్ట్ర రహదారులపై ప్రమాదాలు తగ్గాయి. జిల్లాలో దొంగతనాలను కట్టడి చేసేందుకు పక్కా చర్యలు చేపడుతున్నాం. అంతర్రాష్ట్ర దొంగల ముఠాలపై ప్రత్యేక దృష్టి పెట్టి పట్టుకున్నాం. మోస్ట్ వాంటెడ్ అయిన పార్ధి గ్యాంగ్, థార్ గ్యాంగ్, బైక్స్ గ్యాంగ్‌లను పట్టుకున్నాం. ఇందులో పోలీసు అధికారులు, సిబ్బంది ప్రత్యేక కృషి మరువలేనిది.

హెల్త్ క్యాంపులతో 20 మందికి అత్యవసర చికిత్స

పోలీసు కుటుంబాల సంక్షేమం, ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నాం. మెడికల్ హెల్త్ క్యాంపు నిర్వహించి అత్యవసర చికిత్స అవసరమైన వారిని గుర్తించి వైద్య సేవలు అందించాం. తద్వారా దాదాపు 20 మందిని ప్రాణాపాయం నుంచి కాపాడగలిగాం. మిగతా వారికి వైద్య సహాయం అందించాం. చందంపేట మండలంలోని పోలేపల్లిలో మెగా హెల్త్ క్యాంపును నిర్వహించి గిరిజనులను ఆదుకున్నాం.



400 మందికి ఉద్యోగాలు

యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందుబాటులో లేకపోతే చెడు మార్గం పట్టే ప్రమాదం ఉంది. అందుకే ప్రత్యేకంగా 'యువతేజం' కార్యక్రమాన్ని తీసుకువచ్చా. పలు కంపెనీలతో మాట్లాడి మెగా జాబ్‌మేళా నిర్వహించాం. అందులో కీలకమైన విభాగాల్లో 400 మందికి ఉద్యోగాలు లభించాయి. మరి కొంత మందికి చిన్న కంపెనీల్లోనూ ఉపాధి అవకాశాలు దక్కాయి. అంతేకాదు అందులో గంజాయికి బానిసై తమ కౌన్సెలింగ్‌తో మారిన వారు పదుల సంఖ్యలో మంచి ఉద్యోగాలను పొందారు. మరోవైపు గ్రామీణ యువతలో క్రీడా ఉత్తేజం నింపేందుకు, వారిలో స్నేహబంధం, పోటీతత్వం అలవరిచేందుకు జిల్లా వ్యాప్తంగా కబడ్డీ పోటీలు నిర్వహించాం.

శాంతి భద్రతల పరిరక్షణకు పక్కా వ్యూహం

జిల్లాలో శాంతి భద్రతలను పరిరక్షించేందుకు పక్కా వ్యూహంతో ముందుకు సాగుతున్నాం. 'ఆపరేషన్ చభూత్ర'లో భాగంగా అర్ధరాత్రి రోడ్లపై తిరుగుతూ ఇతరులకు ఇబ్బందులు కలిగించే ఆకతాయిలు, అనుమానిత వ్యక్తులు, నేరప్రవృత్తి కలిగిన వారిని గుర్తించేందుకు చర్యలు చేపట్టాం. జిల్లాలోని రౌడీ షీటర్లను గుర్తించి ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇచ్చాం. తద్వారా రౌడీయిజాన్ని తగ్గించాం. గ్రామ పోలీసు అధికారులను నియమించి గ్రామాల్లో శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా పక్కా చర్యలు చేపడుతున్నాం.

ఇజ్రాయిల్ దాడులను ఖండించాలి



పాలస్తీనా, ఇరాన్‌పై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను ఖండించాలని గురువారం నల్లగొండలోని సుభాష్ విగ్రహం వద్ద నల్ల బ్యానర్‌తో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ప్రజలకు అందుబాటులో ఉండాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

మిర్యాలగూడ : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం ఆమె దామరచర్ల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి ఆస్పత్రిలో ఓపీ రిజిస్టర్, మందుల స్టాక్‌ను పరిశీలించి వైద్యులతో మాట్లాడారు. సమయానుకూలంగా వైద్యులు, సిబ్బంది విధులకు హాజరు కావాలని, ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని, వైద్యం కోసం వచ్చిన రోగులను వెంటనే ఆసుపత్రిలో చేర్చుకోని వైద్యం అందించాలని, కేసులు సీరియస్‌గా ఉన్నప్పుడు మాత్రమే నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి లేదా ఇతర ఆసుపత్రులకు రిఫర్ చేయాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని ఆకస్మింగా తనిఖీ చేసి పిల్లలను పరిశీలించారు. అంతేకాక నిర్మాణంలో ఉన్న టాయిలెట్స్ పనలను పరిశీలించారు. అంతకు ముందు కేజీబీవీని సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. ఆమె వెంట సబ్‌కలెక్టర్ నారాయణ్‌అమిత్, మండల ప్రత్యేకాధికారి పత్యానాయక్, డీఈఓ భిక్షపతి, అధికారులు ఉన్నారు.



దామరచర్ల కేజీబీవీలో విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

భవిత కేంద్రం పరిశీలన

మిర్యాలగూడ : భవిత కేంద్రాల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలందరినీ నమోదు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం మిర్యాలగూడ పట్టణంలో ఏర్పాటు చేసిన భవిత కేంద్రాన్ని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌తో కలిసి ఆమె ప్రారంభించి మాట్లాడారు. భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక అవసరాల పిల్లలకు కృత్యాధార పద్ధతుల్లో విద్యను అందిస్తామన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు విద్యాశాఖ ద్వారా పింఛన్లు అందించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు. ఆమె వెంట డీఈఓ భిక్షపతి తదితరులు ఉన్నారు.

పాఠశాలల పరిశుభ్రతపై దృష్టి సారించాలి

నల్లగొండ : పాఠశాలల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె పాఠశాలల పరిశుభ్రత, మధ్యాహ్న భోజన పథకం అమలు తదితర అంశాలపై జిల్లా, మండల స్థాయి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, హాస్టళ్లలో పారిశుద్ధ్య లోపం లేకుండా చూడాలన్నారు. పాఠశాలల పరిశుభ్రత విషయమై మండల ప్రత్యేక అధికారులు తక్షణమే వారి పరిధిలో సమావేశాలు నిర్వహించాలని, పాఠశాలలను తనిఖీ చేయాలని ఆదేశించారు. ప్రత్యేక అధికారులు పాఠశాలలు, హాస్టళ్లలో బస చేయాలని, ఎంపీడీఓలు కూడా భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, పాల్గొన్నారు.

సైబర్ మోసాలకు గురైతే ఫిర్యాదు చేయాలి



సమావేశానికి హాజరైన సిబ్బంది

నల్లగొండ : సైబర్ నేరగాళ్లు టెక్నాలజీ ఉపయోగించి మోసాలకు పాల్పడుతున్నారని.. మోసపోయామని తెలిసిన వెంటనే 1930 నంబర్‌కు ఫోన్‌ద్వారా ఫిర్యాదు చేయాలని సైబర్ క్రైం డీఎస్పీ లక్ష్మీనారాయణ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సైబర్ వారియర్స్‌తో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే లింకులు, మెసేజ్‌లు ఓపెన్ చేయొద్దని సూచించారు. మోసపూరితమైన ఆన్‌లైన్ యాప్‌లలో అధిక వడ్డీ ఆశ చూపి, పెట్టుబడికి రెట్టింపు సొమ్ము వస్తాయని అనేక మంది అమాయకులను మోసం చేస్తున్న కేసులు నమోదు అవుతున్నాయని.. వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడిగా వెంకటరమణ



కోదాడరూరల్ : కోదాడ మండల పరిధిలోని కాపుగల్లుకు చెందిన ముత్తవరపు వెంకటరమణ ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడిగా ఎంపికయ్యారు. ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ) వారు బుధవారం న్యూఢిల్లీలో జరిగిన సమావేశంలో ఆయనను ఎంపిక చేశారు. ఇండియాలో ఫార్మసీ ఎడ్యుకేషన్‌ను అభివృద్ధి చేయడం, నూతన కళాశాలల మంజూరుతో పాటు రెన్యువల్ చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించనున్నారు. కాపుగల్లుకు చెందిన ముత్తవరపు భాస్కర్‌రావు, కుమారి దంపతుల కుమారుడు వెంకటరమణ 10వ తరగతి వరకు కోదాడలో, ఇంటర్మీడియట్ విజయవాడలో, బీఫార్మసీ కర్ణాటకలో, ఎం ఫార్మసీ అన్నామలై యూనివర్సిటీలో, పీహెచ్‌డీ నాగార్జున యూనివర్సిటీలో పూర్తి చేశారు. ఆయన ప్రస్తుతం మొయినాబాద్‌లోని ఆజాద్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్‌గా, నేషనల్ ఫార్మసీ టీచర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్తులు అభినందించారు.

విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి

మిర్యాలగూడ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ భిక్షపతి అన్నారు. గురువారం మిర్యాలగూడలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1438 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని అందులో 229 హైస్కూల్స్, 117యూపీఎస్, 1100కి పైగా ప్రైమరీ స్కూల్స్, 27 కేజీబీవీలు, 17 మోడల్ స్కూల్స్ ఉన్నాయన్నారు. ఆగస్టు 31తో అడ్మిషన్ల గడువు ముగుస్తుందని.. అప్పటిలోగా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. విద్యార్థులు లేని ప్రభుత్వ పాఠశాలలు 24 ఉన్నట్లు గుర్తించామని వాటిని మూసివేస్తామని తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో పది పాఠశాలలను తిరిగి పునః ప్రారంభించినట్లు వెల్లడించారు. ఆయన వెంట ఎంఈఓ బాలునాయక్ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ భిక్షపతి

పలువురు ఎస్ఐల బదిలీ

నల్లగొండ : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు ఎస్ఐలు బదిలీ అయ్యారు. ఈ మేరకు గురువారం ఐజీ సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. హాలియా ఎస్ఐగా పనిచేస్తున్న సతీష్‌రెడ్డికి సీఐగా ప్రమోషన్ రావడంతో హాలియా సీఐగా నియమించారు. హాలియా సీఐగా పనిచేస్తున్న జనార్దన్‌గౌడ్‌ను ఐజీ ఆఫీస్‌కు అటాచ్ చేశారు. తిప్పర్తి సీఐగా పనిచేస్తున్న సాయి ప్రశాంత్‌ను హాలియా ఎస్ఐగా బదిలీ చేశారు. త్రిపురారం ఎస్ఐ ప్రసాద్‌ను పెద్దవూరకు, హుజుర్‌నగర్ ఎస్ఐ ముత్తయ్యను నాగార్జునసాగర్‌కు బదిలీ చేశారు. మిర్యాలగూడ షీటీమ్ ఎస్ఐ నరేష్‌ను త్రిపురారం ఎస్ఐగా బదిలీ చేశారు. నాగార్జునసాగర్ ఎస్ఐ సంపత్, పెద్దవూర ఎస్ఐ వీరబాబును నల్లగొండ వీఆర్‌కు అటాచ్ చేశారు.

ప్రైవేట్‌లో ఫీజుల దోపిడీ

ఎల్‌కేజీకి రూ.40వేల పైమాటే..

- అనుమతి లేకుండానే పాఠశాలల ఏర్పాటు
- ఒకే పర్మిషన్‌తో అనేక బ్రాంచ్‌లు
- పుస్తకాలు, యూనిఫాం, మా స్కూళ్లలోనే అమ్మకం
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు


మిర్యాలగూడ : సేవా దృక్పథంతో ఉండాల్సిన విద్యా వ్యవస్థ వ్యాపార రంగంగా మారిపోయింది. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో అపనమ్మకం ఏర్పడడంతో తల్లిదండ్రులు ప్రైవేట్ స్కూళ్లను ఆశ్రయిస్తున్నారు. తాము పడ్డ కష్టం తమ పిల్లలు పడవద్దని, ఎంత ఖర్చయినా సరే మంచిగా చదివించాలనే తల్లిదండ్రుల కలలను ఆసరా చేసుకున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం అందిన కాడికి దోచుకుంటున్నాయి. ప్లే, టెక్నో, సీబీఎస్ఈ, ఒలింపియాడ్, ఐఐటీ ఫౌండేషన్ పేరిట తల్లిదండ్రులను మోసం చేస్తూ వేలాది రూపాయలు ఫీజులు గుంజుతున్నాయి. పైగా పాఠశాలల్లోనే పుస్తకాలు యూనిఫాం, టై, బెల్టులు కొనాలని నిబంధన పెట్టి వాటి పేరిట కూడా వేలాది రూపాయలు వసూలు చేస్తున్నాయి. ఇదంతా బహిరంగంగానే సాగుతున్నా విద్యాశాఖ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది.

ట్యాగ్‌లు పెట్టి మరీ..

ప్రైవేట్ పాఠశాలలకు ప్లే, టెక్నో, సీబీఎస్ఈ, ఒలింపియాడ్, ఐఐటీ ఫౌండేషన్ వంటి పేర్లతో కార్పొరేట్ ట్యాగ్‌లు పెట్టి మరీ దోపిడీ చేస్తున్నారు. వీటికి అనుమతులు లేకపోయినప్పటికీ అనధికారికంగా ట్యాగ్‌లు ఏర్పాటు చేసి ప్రత్యేకంగా క్లాస్‌లు బోధిస్తామని చెప్పి వాటి పేరిట వేలాది రూపాయలు గుంజుతున్నారు. వీటి కోసం ప్రత్యేక పుస్తకాలను తమ పాఠశాల పేరుతో ముద్రించి వాటిని కొనుగోలు చేసేలా తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. తీరా పుస్తకాలను కొన్నాక ఆ పుస్తకాల సిలబస్‌ను బోధించే పాపాన పోవడం లేదు.

జిల్లాలో 369 ప్రైవేట్ పాఠశాలలు..

జిల్లాలో 369 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. అనుమతి లేకుండానే చాలా పాఠశాలు నడుస్తున్నాయి. ప్రైవేట్ పాఠశాలల్లో 1,25,572 మంది వరకు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఆయా పాఠశాలల్లో బయటి మార్కెట్లో దొరికే వస్తువుల ధరలకు ప్రైవేట్ పాఠశాలల్లో లభించే వాటికి చాలా వ్యత్యాసం ఉంటోంది. నర్సరీ నుంచి 5వ తరగతి వరకు పుస్తకాలు, బూట్లు, యూనిఫాం, టై, బెల్టు, గుర్తింపు కార్డులు తదితర వాటి పేరుతో ఫీజులు కాకుండా రూ.4 నుచి రూ.10వేల వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో విక్రయించే పాఠ్య పుస్తకాలు మార్కెట్‌లో ఎక్కడా దొరకకపోవడంతో గత్యంతరం లేక వాటినే తీసుకోవాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి.



నల్లగొండకు చెందిన ఓ చిరుద్యోగి తన కుమారుడిని ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఎల్‌కేజీలో జాయిన్ చేయాలనుకున్నాడు. పాఠశాలకు వెళ్లి ఫీజు వివరాలు అడిగాడు. అడ్మిషన్ ఫీజు, స్కూల్ ఫీజు, పుస్తకాలు, టై, బెల్టు, యూనిఫాం, రవాణా చార్జీలు కలుపుకొని ఏడాదికి మొత్తం రూ.40వేలు అవుతాయని స్కూల్ యాజమాన్యం చెప్పింది. దీంతో అతడు ఎల్‌కేజీకే ఇంతా ఫీజా అని అవాక్కయ్యాడు. ఇలా జిల్లాలో ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల దందా సాగుతోంది.

నోటీసులతో సరిపెట్టుకుంటున్న అధికారులు..

ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నా వాటి అనుమతులు, ఇతర శాఖల పర్మిషన్ల విషయాలపై విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అనుమతి లేని పాఠశాలలను గుర్తించి కేవలం నోటీసులు జారీ చేసి వదిలేస్తున్నారే తప్ప చర్యలు తీసుకున్న పాపాన పోవడం లేదు. ప్రైవేట్ పాఠశాలలపై ప్రభుత్వ అజమాయిషీ లేకపోవడం, ఫీజుల నియంత్రణ చేయకపోవడం, ప్రజాప్రతినిధుల అండదండలు ఉండడంతో విద్యా వ్యవస్థను వ్యాపారంగా మార్చుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి విద్యా వ్యాపారాన్ని అరికట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



మిర్యాలగూడ రెడ్డికాలనీలో అనుమతి లేని ఓ పాఠశాల వద్ద ఎంఈఓ బాలునాయక్

ఇతర పేర్లతో స్కూల్స్ నిర్వహణ

ప్రైవేట్ పాఠశాలల్లో చాలా వరకు అనుమతులు ఉండడం లేదు. మూతపడ్డ పాఠశాల అనుమతుల పేరిట తమ సొంత పేరు పెట్టుకుని పాత పాఠశాల అనుమతితోనే కొనసాగిస్తున్నారు. ప్రతి మండలంలో ఇలా 10 నుంచి 15 పాఠశాలలు నడుస్తున్నాయి. ప్రధాన పట్టణాలైన నల్లగొండ, మిర్యాలగూడ, నకిరేకల్, దేవరకొండ, హాలియా ప్రాంతాల్లో బడా కార్పొరేట్ పాఠశాలలు వాటి బ్రాంచ్‌లను అనధికారికంగా ఏర్పాటు చేస్తున్నాయి. అంతేకాకుండా అనుమతులు లేకుండానే ప్లే గల్లిగల్లీలో స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నారు. షాపింగ్ కాంప్లెక్స్‌లు, ఇళ్లు, వ్యాపార సముదాయాల్లో కూడా పాఠశాలలను నడిపిస్తున్నారు. కనీసం సేఫ్టీ పరికరాలు అందుబాటులో ఉంచుకోకుండా విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

అనుమతి లేని స్కూళ్లపై చర్యలు తీసుకుంటాం

జిల్లాలో అనుమతి లేని పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకుంటాం. అనుమతిలేని పాఠశాలలను సీజ్ చేయాలని ఇప్పటికే ఎంఈఓలకు ఆదేశాలు జారీ చేశాం. ఎవరైనా పాఠశాలల పేర్లు మార్చడం కానీ, ఒకే పాఠశాలకు అనుమతి తీసుకోని అనేక బ్రాంచ్‌లు ఏర్పాటు చేస్తే కఠినంగా వ్యవహరిస్తాం. పుస్తకాలు, యూనిఫాంలు అదే పాఠశాలలో కొనాలన్న నిబంధన లేదు. కొనాలని విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడి చేస్తే ఉపేక్షించేది లేదు.

– భిక్షపతి, డీఈఓ

క్లుప్తంగా

భువనగిరి ఖిలా టికెట్ ధరలు పెంపు



భువనగిరి ఖిలా

భువనగిరి: భువనగిరి ఖిలా సందర్శనకు టికెట్ ధరలను పెంచుతూ తెలంగాణ హెరిటేజ్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ ఈ నెల 6న ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వుల ప్రకారం ఖిలా సందర్శనకు గాను పెద్దలకు గతంలో రూ.10 టికెట్ ఉండగా.. ప్రస్తుతం రూ. 20కు పెంచారు. అదేవిధంగా పిల్లలకు గతంలో రూ.5 టికెట్ ఉండగా.. ఇప్పుడు రూ.10కు పెంచారు. మిగిలిన ధరలు యాథావిధిగా ఉన్నాయి. గతంలో సందర్శకుల ద్వారా వచ్చిన ఆదాయం తెలంగాణ రాష్ట్ర ఆర్థిక శాఖకు వెళ్లేది. తాజాగా జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం వచ్చిన ఆదాయాన్ని మ్యూజియం నిర్వహణ, రికార్డుల నిర్వహణ కోసం ఉపయోగించుకునే అవకాశాన్ని కల్పించారు.

ప్రైవేట్ పాఠశాలల బస్సుల అడ్డగింత



బస్సులను అడ్డుకున్న ఏపూరు గ్రామస్తులు

ఆత్మకూర్ (ఎస్): ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని ఏపూరు గ్రామం నుంచి సూర్యాపేటలోని వివిధ ప్రైవేట్ పాఠశాలలకు విద్యార్థులను తీసుకెళ్లే స్కూల్ బస్సులను గురువారం గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. లక్షల్లో ఫీజులు వసూలు చేసే ప్రైవేట్ పాఠశాలల బస్సులు తమ గ్రామానికి రావొద్దని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులను పిలిపించి కొందరు గ్రామస్తులు తమ పిల్లలకు ప్రభుత్వ స్కూల్‌లో చేర్పించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష

రామగిరి(నల్లగొండ): నల్లగొండ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన ఇద్దరు వ్యక్తులను నల్లగొండ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ గురువారం ఒక రోజు జైలు శిక్షతోపాటు రూ.వెయ్యి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సైదాబాబు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపినా, మైనర్లు వాహనాలు నడిపినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అధ్వానంగా కాల్వలు



ఆనవాళ్లు కోల్పోయి అధ్వానంగా మారిన శాలిగౌరారం ప్రాజెక్టు కుడి కాలువ



కంపచెట్లు, చెత్తాచెదారంతో నిండిన పంట కాలువ

- కంప చెట్లు, చెత్తాచెదారం, మురుగునీటితో నిండిన శాలిగౌరారం ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలు
- ఆందోళనలో ఆయకట్టు చివరి రైతులు

శాలిగౌరారం: ఉమ్మడి జిల్లాలో మధ్యతరహా ప్రాజెక్టులలో ఒకటైన శాలిగౌరారం ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలు అధ్వానంగా మారాయి. ప్రధాన కాల్వలు దెబ్బతినడం, ప్రధాన కాల్వలపై ఉన్న పంట కాల్వల తూములు, షట్టర్లు పూర్తిగా ధ్వంసం కావడంతో సాగునీరు వృథాగాపోతుంది. అంతేకాకుండా కాల్వల్లో కంపచెట్లు, చెత్తాచెదాం నిండడడంతో ఆయకట్టు చివరికి సాగునీరందడం కష్టంగా మారుతోంది. దీంతో ఆయకట్టు చివరి భూముల రైతులు సాగునీరు కోసం నానా అవస్థలు పడుతున్నారు. శాలిగౌరారం ప్రాజెక్టు 1200 ఎకరాల విస్తీర్ణంలో 21 అడుగుల నీటి నిల్లవ సామర్థ్యంతో 6వేల ఎకరాల ఆయకట్టు కలిగి ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 19 అడుగుల మేర నీరు ఉంది.

సాగునీరందేది 6 కి.మీ. మాత్రమే..

శాలిగౌరారం ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల మొత్తం పొడవు 12 కిలోమీటర్లు. అందులో కుడి కాల్వ పొడవు 6.5 కిలోమీటర్లు, ఎడమ కాల్వ పొడవు 5.5 కిలోమీటర్లు. దశాబ్దాల కాలంగా ప్రధాన కాల్వలు మరమ్మతులకు నోచుకోకవడంతో పూర్తిగా ధ్వంసమయ్యాయి. ప్రస్తుతం ఒకొక్క కాల్వ ద్వారా గరిష్టంగా 3 కిలోమీటర్ల వరకు కూడా సాగునీరు ప్రవహించని పరిస్థితి. ప్రధాన కాల్వల వెంట అక్రమంగా విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసి ఎగువ ప్రాంతానికి నీటిని తరలించడంతో ఆయకట్టు చివరి భూములకు నీరందని పరిస్థితి నెలకొంది.

మురుగునీటితో కష్టంగా పూడికతీత..

కుడి, ఎడమ ప్రధాన కాల్వలు నిత్యం డ్రెయినేజీ నీటితో నిండి ఉంటున్నాయి. కుడి కాల్వలోకి తిరుమలరాయునిగూడెం, బాలిశెట్టిగూడెం, మార్కెట్ కాలనీ, పావురాలగూడెం గ్రామాల నుంచి డ్రెయినేజీలను కలిపారు. అదేవిధంగా ఎడమ కాల్వకు రామగిరి గ్రామం నుంచి వచ్చే డ్రెయినేజీని కలిపారు. దీంతో కుడి, ఎడమ కాల్వలు నిత్యం మురుగునీటితో నిండి ఉండటంతో కనీసం ఉపాధి హామీ పథకంలో భాగంగా కాల్వలను పూడిక తీసేందుకు కూలీలు ముందుకు రావడంలేదు. రైతులు సొంత ఖర్చులతో జేసీబీల సహాయంతో కాల్వలలో పూడిక తీసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

సీసీ లైనింగ్‌తో ఆధునీకరించాలి



శాలిగౌరారం ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలను సీసీ లైనింగ్‌తో పూర్తిస్థాయిలో ఆధునీకరించాలి. అప్పుడు ప్రాజెక్టు సాగునీరు వృథాకావడం, అక్రమంగా నీటిని ఎగువకు తరలించడం పూర్తిగా నిలిచిపోవడంతో ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరందుతుంది. పేరుకే ప్రాజెక్టు ఆయకట్టులో ఉన్నాం. కానీ ఏనాడు చివరి భూములకు సాగునీరందిన దాఖలాలు లేవు.

– కట్టు వెంకట్‌రెడ్డి, రైతు, అడ్లూరు

పూడికతీతకు నిధులు లేవు



శాలిగౌరారం ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల్లో పూడిక తీసేందుకు నీటి పారుదలశాఖలో నిధులు లేవు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైతే తప్ప ప్రత్యేకంగా నిధులు వెచ్చించే పరిస్థితి నీటిపారుదలశాఖకు ఉండదు. ప్రస్తుతం వానాకాలం సాగు నేపథ్యంలో రైతులే తమ సొంత ఖర్చులతో కాల్వల్లో పూడికతీత పనులు చేయించుకోవాలని కోరుతున్నాం.

– సత్యనారాయణ, ఇరిగేషన్ డీఈఈ, శాలిగౌరారం ప్రాజెక్టు

రెగ్యులర్ పద్ధతిన నియామకాలు చేపట్టాలి



మాట్లాడుతున్న టీఎన్‌జీఓల సంఘం సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు జగదీష్

యాదగిరిగుట్ట: రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల్లో పనిభారం తగ్గించేందుకు గాను ఖాళీగా ఉన్న పోస్టుల్లో రెగ్యులర్ పద్ధతిన నియామకాలు చేపట్టాలని టీఎన్‌జీఓల సంఘం సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు మారం జగదీష్ ప్రభుత్వాన్ని కోరారు. యాదగిరిగుట్టలోని పాత గోశాలలో గురువారం ఏర్పాటు చేసిన రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల ఉద్యోగులు, సిబ్బంది సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధాన దేవాలయాల ఉద్యోగులకు హెల్త్ కార్డులు, పీఆర్సీ అనుమతించి, రాబోయే ప్రభుత్వ జీఓలో ప్రత్యేకంగా పొందుపరచాలన్నారు. జీఓ నంబర్ 888ను దేవాలయాల్లో ఉన్న పోస్టులకు అనుగుణంగా పూర్తి స్థాయిలో సవరణ చేయాలని, జీఓ నంబర్ 261ని సవరించాలన్నారు. పదవీ విరమణ దగ్గర్లో ఉన్న ఉద్యోగులు, అనారోగ్యంతో బాధపడుతున్న ఉద్యోగులను మానవతా దృక్పథంతో తమ తమ మాతృ సంస్థలకు బదిలీ లేదా డిప్యూటేషన్‌పై పంపాలని కోరారు. సీపీఎస్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలన్నారు. అనంతరం ప్రధాన దేవాలయాల్లో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, ఉద్యోగులకు అవసరమ్యే అంశాలపై చర్చించారు. త్వరలోనే దేవాదాయ, ధర్మదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసి తమ సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన దేవాలయాల ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గజవెల్లి రమేష్‌బాబు, టీఎన్‌జీఓల సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ ముజీబ్, అసోసియేట్ ప్రెసిడెంట్ కస్తూరి వెంకటేష్, ముక్కెర్ల సత్యనారాయణ, జిల్లా జేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్‌రెడ్డి, ఆయా దేవాలయాల అధ్యక్షులు వి. శ్రీనివాస్‌రెడ్డి (భద్రాచలం), కూరగాయల శ్రీనివాస్ (వేములవాడ), సుదర్శన్ (బాసర), మల్లికార్జునస్వామి (కొమురవెల్లి), చందు (కొండగట్టు), దూశెట్టి కృష్ణ, దయానంద్ (యాదగిరిగుట్ట), 150 మంది ఉద్యోగులు పాల్గొన్నారు.

భక్తులకు అభిషేక జల సంప్రోక్షణ, హారతి

- ఏర్పాట్లు చేయాలని ఆదేశించిన యాదగిరిగుట్ట ఈఓ వెంకట్రావ్



యాదగిరిగుట్ట ఆలయ అర్చకులు, అధికారులతో మాట్లాడుతున్న ఈఓ వెంకట్రావ్

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వచ్చే ప్రతి భక్తుడికి ప్రధానాలయంలో అభిషేక జల సంప్రోక్షణ, హారతి ఇచ్చేలా చర్యలు చేపట్టాలని ఆలయ ప్రధానార్చకులకు, అధికారులకు ఈఓ వెంకట్రావ్ ఆదేశాలు జారీ చేశారు. గురువారం ఆలయ అధికారులు, అర్చకులతో ఈఓ తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. స్వామివారి అంతరాలయములో వెళ్లే భక్తులు తప్పనిసరిగా సంప్రదాయ దుస్తులను ధరిస్తేనే అనుమతి ఇవ్వాలని సూచించారు. భక్తులు అధిక సంఖ్యలో వస్తున్న నేపథ్యంలో శని, ఆదివారాల్లో సాధారణ భక్తులకు త్వరితగతిన దర్శన సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి శని, ఆదివారాల్లో ప్రొటోకాల్ పరిధిలోకి వచ్చే ప్రముఖులు స్వయంగా వస్తేనే ప్రొటోకాల్ దర్శనం కల్పించబడుతుందన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో ప్రొటోకాల్ దర్శనము వారందరూ టికెట్ తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. భక్తుల్లో భక్తి భావం పెంపొందించేందుకు శ్లోకములు, వాటి అర్థాలను వివరిస్తూ బోర్డులు, పెయింటింగ్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అంతేకాకుండా దేవస్థాన భద్రతకు సంబంధించి పటిష్టమైన భద్రత ఏర్పాటు చేసి అంకితభావంతో విధులు నిర్వహించాలని ఎస్పీఎఫ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఈఓ భాస్కర్‌శర్మ, ప్రధానార్చకులు నల్లంథీఘల్ లక్ష్మీనరసింహచార్యులు, కాండూరి వెంకటచార్యులు, అధికారులు దయాకర్ రెడ్డి, రామారావు, రాజన్‌బాబు, ఎస్పీఎఫ్ ఆర్ఐ శేష గిరిరావు తదితరులున్నారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

- నలుగురు దొంగల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట ఎస్పీ కె. నరసింహ

సూర్యాపేటటౌన్: తాళం వేసిన ఇళ్లే టార్గెట్ చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు వివరాలను గురువారం సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ కె. నరసింహ విలేకరులకు వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన ఇటికాల ఫణిచంద్, కోదాడకు చెందిన నాగేంద్రబాబు, మరో ఇద్దరు బాలురు జల్సాలకు అలవాటుపడి రాత్రిపూట తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసి చోరీలకు పాల్పడుతున్నారు. చోరీ చేసిన సొత్తును అమ్మేందుకు కోదాడ పట్టణానికి రాగా స్థానిక పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి ఎనిమిది తులాల బంగారం, బైక్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ఫణిచంద్ వివిధ పోలీస్ స్టేషన్లలో 17 కేసులు ఉన్నాయని, గతంలో జైలుకు వెళ్లి కూడా వచ్చినట్లు ఎస్పీ తెలిపారు. ఫణిచంద్, నాగేంద్రబాబును రిమాండ్‌కు తరలించగా.. ఇద్దరు బాలురను జువైనల్ హోంకు తరలించినట్లు తెలిపారు. నిందితులను పట్టుక్ను కోదాడ పోలీసులను ఎస్పీ అభినందించారు

ఆత్మీయ భరోసా పథకాన్ని అమలు చేయాలి

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగయ్య



మాట్లాడుతన్న నాగయ్య

మునగాల: రాష్ట్రంలో భూమిలేని వ్యవసాయ కార్మికులకు ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి. నాగయ్య డిమాండ్ చేశారు. గురువారం మునగాల మండలంలోని కొక్కిరేణి గ్రామంలో నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూమిలేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా ఏడాదికి రూ.12వేల ఆర్థికసాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చి.. 16నెలలు గడుస్తున్నా నేటికీ ఇచ్చిన హామీని అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి ఆదుకోవాలని, భూభారతిలో అసైన్డ్ భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న డిజిటల్ సర్వేను వెంటనే రద్దు చేయాలని కోరారు. రాష్ట్రంలో లక్షలాదిగా ఉన్న ప్రభుత్వ భూములన్నింటిని పేద వ్యవసాయ కార్మిక కుటుంబాలకు పంచాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు, జిల్లా కార్యదర్శి మట్టిపల్లి సైదులు, జిల్లా ఉపాధ్యక్షులు కొదమగుండ్ల నగేష్, జిల్లా కమిటీ సభ్యులు బెల్లంకొండ వెంకటేశ్వర్లు, సొంపంగు జానయ్య, పోసనబోయిన హుస్సేన్, గుంజ వెంకటేశ్వర్లు, షేక్ సైదా హుస్సేన్, నారసాని వెంకటేశ్వర్లు, జంపాల స్వరాజ్యం, గుండు సైదులు, ఆరె రామకృష్ణారెడ్డి, దోసపాటి భిక్షం పాల్గొన్నారు.

ట్రాక్టర్ తిరగబడడంతో రైతు మృతి

తిప్పర్తి: పొలం దున్నుతుండగా ట్రాక్టర్ తిరగబడడంతో రైతు మృతిచెందాడు. ఈ ఘటన తిప్పర్తి గ్రామ పంచాయతీ పరిధిలోని తిప్పలమ్మగూడెంలో గురువారం జరిగింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పలమ్మగూడెం గ్రామానికి చెందిన దేవిరెడ్డి వెంకట్‌రెడ్డి (51) ట్రాక్టర్‌తో గురువారం పొలం దున్నుతుండగా ట్రాక్టర్ బురదలో దిగబడింది. బురదలో నుంచి ట్రాక్టర్‌ను బయటకు తీసే క్రమంలో ట్రాక్టర్ తిరగబడింది. దీంతో వెంకట్‌రెడ్డి ట్రాక్టర్ కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య సరిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తిప్పర్తి పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ రాంమూర్తి తెలి పారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ట్రాక్టర్ పైనుంచి పడి..



వీరస్వామి (ఫైల్)

నూతనకల్: ట్రాక్టర్ పైనుంచి పడి డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన నూతనకల్ మండలం పరిధిలోని పెద నెమిల గ్రామ పంచాయతీలో గురువారం జరిగింది. స్థానిక ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్ద నెమిల గ్రామ పంచాయతీకి చెందిన గంగుల వీరస్వామి(50) అదే గ్రామానికి చెందిన జెన్నారెడ్డి వివేక్‌రెడ్డి వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం వ్యవసాయ పొలంలో వీరస్వామి ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతుండగా.. బండరాయిని ఎక్కడంతో అదుపుతప్పి వీరస్వామి ట్రాక్టర్‌పై నుంచి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం సూర్యాపేట ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి కుమారుడు కమలాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

దొంగతనం కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ పీఎన్‌డీ ప్రసాద్

మిర్యాలగూడ: ఆటో చోరీ కేసులో నిందితుడిని గురువారం దామరచర్లలో పోలీసులు అరెస్ట్ చేశారు. మిర్యాలగూడ రూరల్ సీఐ పీఎన్‌డీ. ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండల కేంద్రానికి చెందిన వెంపటి శ్రీనివాస్ ఈ నెల 7వ తేదీ రాత్రి 10గంటల సమయంలో తన ఆటోను తన దుకాణం ముందు ఉంచి ఇంటికి వెళ్లి నిద్రించాడు. మరుసటి రోజు ఉదయం వచ్చి చూడగా ఆటో కనిపించలేదు. దీంతో బాధితుడు ఈ నెల 11న వాడపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా పిడుగురాళ్లలోని బుడిగజంగాల కాలనీకి చెందిన పెల్లూరి ఆంజనేయులు గురువారం దామరచర్ల చెక్‌పోస్టు వద్ద దొంగిలించిన ఆటోలో వస్తుండగా.. పోలీసులు అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు పిడుగురాళ్లకు చెందిన కొండపల్లి ఆంజనేయులు పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. సీఐ వెంట ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఎంజీయూలో యోగా డే బ్రోచర్ విడుదల

నల్లగొండ టౌన్: ఈ నెల 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా డేను పురస్కరించుకుని గురువారం మహాత్మాగాంధీ యూనివర్సిటీలో వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ యోగా డే బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ అల్వాల రవి, డాక్టర్ పసుపుల మద్దిలేటి, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రేమ్‌సాగర్, శ్రీదేవి, షరీఫ్, శేఖర్, వీరస్వామి, సుధాకర్ పాల్గొన్నారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, ప్రొఫెసర్లు

ప్రభుత్వ బడిలో కుమారుడిని చేర్పించిన టీచర్



కుమారుడికి అడ్మిషన్ తీసుకుంటున్న ఉపాధ్యాయుడు మణిరాజ్ (ఆకుపచ్చ రంగు షర్ట్ వ్యక్తి)

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి మండలం ఏపీ లింగోటం గ్రామ జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయుడు ఆదిమల్ల మణిరాజ్ తన కుమారుడు సత్యరాజును అదే పాఠశాలలో 10వ తరగతిలో గురువారం చేర్పించారు. 9వ తరగతి ప్రైవేట్ స్కూల్‌లో చదివిన తన కుమారుడిని 10వ తరగతిలో ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడంతో మణిరాజును పాఠశాల ఉపాధ్యాయుల బృందం అభినందించారు. పాఠశాలలో చేరిన విద్యార్థులందరికీ నాణ్యమైన విద్యా బోధన చేయనున్నట్లు ప్రధానోపాధ్యాయుడు మల్లేపల్లి కాశయ్య తెలిపారు.

వర్మీ కంపోస్టుతో అధిక దిగుబడి



గుర్రంపోడు : గతంలో రైతులు సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేసేవారు. కాలానుగుణంగా పంటలు అధిక దిగుబడి సాధించడం కోసం రైతులు రసాయన ఎరువులు వాడడం మొదలు పెట్టారు. రసాయన ఎరువుల మోతాదును పెంచుకుంటూ పోవడంతో ఏర్పడిన దుష్ఫలితాలను గ్రహించిన రైతులు మళ్లీ సేంద్రియం వైపు మొగ్గు చూపుతున్నారు. సేంద్రియ ఎరువు వాడడం వల్ల రైతులు వ్యవసాయంలో అధిక దిగుబడి సాధించే అవకాశం ఉంది. సేంద్రియ ఎరువంటే పశువుల ఎరువే కాదు..జీవన ఎరువులు, పచ్చి రొట్ట ఎరువులు, వర్మీ కంపోస్టు కూడా వస్తాయి. వర్మీ కంపోస్టు తయారీపై అనుముల ప్రాంతీయ ఉద్యానవన శాఖ అధికారి మురళి అందిస్తున్న సలహాలు, సూచనలు ఆయన మాటల్లోనే..

రైతు మిత్రులుగా వానపాములు

వ్యవసాయ వ్యర్థ పదార్థాలతో తయారయ్యే వర్మీ కంపోస్టు ముఖ్యమైన సేంద్రియ ఎరువుగా చెప్పవచ్చు. పురాతన కాలం నుంచి వానపాములను రైతు మిత్రులుగానే పరిగణిస్తాం. ఈ వానపాములు పాక్షికంగా కుళ్లిన వ్యర్థ పదార్థాలను తిని విసర్జించిన పదార్థాన్నే వర్మీ కంపోస్టు అంటారు.

పాడిపంట

వర్మీ కంపోస్టు తయారీ విధానం

- మూడు అడుగుల వెడల్పుతో కావలసిన పొడువు వరకు ఒక్కో బెడ్ చొప్పున లభించే వ్యర్థ పదార్థాలు, స్థలాన్ని బట్టి బెడ్లు ఏర్పాటు చేసుకోవాలి.
- ఈ బెడ్‌ను వర్షపు నీరు, సూర్యరశ్మి, అధిక ఉష్ణోగ్రతల నుంచి కాపాడడానికి పైన తాటాకు పందిర్లతో లేదా రేకులతో కప్పు నిర్మించాలి.
- బెడ్ అడుగు భాగంలో సిమెంట్‌తోగాని, పేడతోగాని అలికి గట్టిగా ఉండేలా చూడాలి.
- అడుగు భాగం నుంచి 10 సెం.మీ ఎత్తు వరకు పాక్షికంగా కుళ్లిన వ్యర్థ పదార్థాలను వేయాలి. దీనిపై పలుచగా నీరు చల్లాలి.
- ఆ తర్వాత మళ్లీ మరో వరుస 15–30 సెం.మీ మందంలో సేంద్రియ వ్యర్థ పదార్థాలు, కుళ్లిన కూరగాయలు వేసుకోవచ్చు. దీనిపైన పలుచగా నీరు పెట్టి, వరి గడ్డితోగాని, పాత గోనె సంచులతోగాని కప్పి ఉంచాలి.
- ఈ బెడ్‌కు ప్రతిరోజు పలుచగా నీరు పెడుతూ ఒక వారం రోజుల తర్వాత ఒక చదరపు మీటరుకు 1000 వానపాముల చొప్పున వదలాలి. ప్రతిరోజు నీరు పెడుతూ అప్పుడప్పుడు బెడ్‌ను కదిలించాలి.
- బెడ్‌లలో వేసిన వ్యర్థ పదార్థాలు అదే రూపంలో లేకుండా తేలికగా, నల్లగా, వాసన లేకుండా ఉండే పదార్థంగా ఏర్పడినట్లయితే వర్మీ కంపోస్టు తయారైనట్లుగా భావించవచ్చు.
- ఈ దశలో నీరు పెట్టడం ఆపేస్తే వానపాములన్నీ బెడ్‌ల అడుగు భాగానికి చేరుతాయి.
- ఆ తర్వాత పైన ఉండే వర్మీ కంపోస్టును జల్లడ పట్టినట్లయితే వర్మీ కంపోస్టు వస్తుంది.
- అనంతరం వానపాములను మరో బెడ్‌లోకి వదలాలి.

జాగ్రత్తలు

- సేంద్రియ వ్యర్థ పదార్థాలు వేసేటప్పుడు దానిలో ప్లాస్టిక్ కవర్లు, గాజు పెంకులు వంటివి లేకుండా చూసుకోవాలి.
- బెడ్‌లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.

వర్మీ కంపోస్టు వల్ల ఉపయోగాలు

- నేలలో సేంద్రియ కర్బనం పెంచుతుంది.
- భూ భౌతిక రసాయన పరిస్థితులను మెరుగుపరుస్తుంది.
- భూసారాన్ని పరిరక్షిస్తూ ఉత్పాదకతను పెంచుతుంది.
- భూమిలో గాలి ప్రసరణ, నీరు నిల్వ చేసుకునే సామర్థ్యం పెంచుతుంది.
- పోషకాల లభ్యత పెంచడంలో మొక్క సులభంగా గ్రహించడంలో తోడ్పతుంది.
- పండ్ల తోటల్లో ఒక చెట్టుకు 5 కిలోలు, పూల కుండీల్లో 250 గ్రాములు వర్మీ కంపోస్టు వాడుకోవచ్చు.